## ఉద్యోగం పోయిందని యువకుడు ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18 : నేను భయంతో చనిపోవడం లేదు..బాధ భరించలేక చనిపోతున్నాను. నా మరణానికి కారణం ఎవరు కారు. అని డైరీలో సూసైడ్ నోట్ రాసి.. ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఖమ్మం జిల్లా ములకపల్లి మండలం పుసుగూడెం గ్రామానికి చెందిన పుల్లూరి గోపికృష్ణ (26)హైదరాబాద్ నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ 7వ పేజ్‌లో నివసిస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తుండేవాడు. కొద్దిరోజుల క్రితం ఉద్యోగం పోవడంతో.. మనస్థాపంతో ఊరికి వెళ్లాడు. మరల నగరానికి వచ్చి స్నేహితుడు రూమ్‌కి వెళ్లి.. లుంగీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేస్తున్నారు. ఉద్యోగం లేకపోవడంతో మనస్థాపం చెంది.. తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



జగద్గిరిగుట్ట : వేర్వేరు ఘటనల్లో జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో ఇద్దరు అదృశ్యం అయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లమ్మ బండలో నరసింహులు, రేఖ దంపతులు నివాసం ఉంటారు. రేఖకు కొంతకాలంగా మానసిక్షస్థితి సరిగా ఉండడం లేదు. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె వద్ద ఉన్న ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ దొరుకకపోవడంతో బంధువుల ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశారు.



### మరో ఘటనలో వ్యక్తి..

గణేశ్‌నగర్‌కు చెందిన వడ్డే వెంకటేశ్ భవన నిర్మాణ కార్మికుడు. ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. స్వగ్రామమైన మహబూబ్ నగర్‌లో విచారించినా రాలేదని తెలిసింది. దీంతో భార్యభార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ శంబీపూర్ కృష్ణ

దుండిగల్, జూన్ 18 : సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హులందరూ వినియోగించుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు, మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంబీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంబీపూర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు మంజూరు చేయించిన రూ.2,99,500 విలువ చేసే ఎనిమిది సీఎంఆర్ఎఫ్ చెక్కులను సదరు కుటుంబలకు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మాదాస్ నవీన్, రంజిత్ రెడ్డి, బాలకృష్ణ, అశోక్, ప్రవీణ్ నాయక్, కుంట్ల నందు పాల్గొన్నారు. అంతకుముందు సంక్షేమ సంఘాల నాయకులు ,బీఆర్ఎస్ నాయకులులు, ప్రజలు శంభీపూర్ కృష్ణను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.



ఎమ్మెల్యే వివేకానంద్ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, పార్టీ శ్రేణులు

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కుత్బుల్లాపూర్, జూన్ 18: పేదకుటుంబాలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ సహకారంతో విడుదలైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం అందజేశారు. సూరారం 129వ డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన రామచందర్ (57) తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుండగా.. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ను సంప్రదించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించడంతో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఎల్వోసీని రామచందర్ కుటుంబానికి చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ సిద్దిక్, నాయకులు చెక్కా సురేశ్, హెచ్ఏఎల్ బషీర్ పాల్గొన్నారు.



## వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18 : కేపీహెచ్‌బీ కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ గణపతి స్వామి వారికి సహస్ర పట్టాభిషేకం, మహా సుదర్శన హోమం, కల్పవృక్ష వాహనంపై ఊరేగింపు పూజలు జరిగాయి.

## బొందలగడ్డ స్థలాన్ని కాపాడండి



ఉప తహసీల్దార్ అవినాశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుండిగల్ వాసులు

దుండిగల్, జూన్ 18 : దుండిగల్ చిన్నదామరచెరువు సమీపంలోని శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు బుధవారం గండిమైసమ్మ – దుండిగల్ ఉప తహసీల్దార్ అవినాశ్‌తో పాటు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ను కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. దుండిగల్‌లోని చిన్నదామరచెరువు శిఖం భూమిలోని 30 గుంటలను గడిచిన 150 ఏండేగా శ్మశాన వాటిక (బొందల గడ్డ)గా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల భూముల ధరలు పెరగడంతో బొందలగడ్డ స్థలంపై కన్నేసిన గ్రామానికి చెందిన పలువురు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే 10 గుంటల వరకు కడీలు పాతారని పేర్కొన్నారు. స్థలాన్ని కబ్జా చేసి విక్రయించి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని, కబ్జాదారుల నుంచి బొందల గడ్డను కాపాడి న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పిట్ల సత్యనారాయణ, పోతారం మల్లేశ్, వెంకటేశ్, ప్రసాద్, అర్జున్, వీరస్వామి , శంకర్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఎస్సీఐఐఎన్వీ బయోసైన్సెస్, మైక్రోబిరా సంస్థల ప్రతినిధులు

### ఎస్సీఐఐఎన్వీ బయోసైన్సెస్, మైక్రోబిరా
## మధ్య కుదిరిన ఒప్పందం

కొండాపూర్, జూన్ 18 : సకాలంలో వ్యాధికారకాలను గుర్తించడం ద్వారా అనుచితమైన యాంటీబయాటిక్ వాడకాన్ని అరికట్టడం, ఔషధ నిరోధకతకు వ్యతిరేకంగా పోరాడడుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లోని ఎస్సీఎన్ఐఐఎన్వీ బయోసైన్సెస్, యూకే కు చెందిన మైక్రోబిరా బయోసైన్సెస్‌తో ఒప్పందం కుదిరినట్లు బుధవారం వర్సిటీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)కి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటాన్ని బలోపేతం చేయడానికి, తదుపరి తరం డిజిటల్ డయాగ్నస్టిక్ పరిష్కారాలను అభివృద్ధి చేయడం, అమలు చేయడం ఈ ఒప్పందం లక్ష్యమని వర్సిటీ అధికారులు తెలిపారు. ముందస్తు , ఖచ్చితమైన వ్యాధికారక గుర్తింపుపై దృష్టి సారించడం, తద్వారా విస్తృత యాంటీ బయాటిక్స్ దుర్వినియోగాన్ని తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

జీడిమెట్ల, జూన్ 18 : క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని వైద్యులు చిగురుపాటి ప్రజ్ఞ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారంలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో జీడిమెట్లలో గ్రానుల్స్ ఇండియా, ఏఐజీ దవాఖాన, క్షత్రియ వనిత వికాస్ ఆధ్వర్యంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ప్రజ్ఞ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పరీక్షలు చేయించుకోవాలని ముందుగా గుర్తిసే రొమ్ము తొలగించాల్సిన అవసరం ఉండదన్నారు. వనిత దాట్ల, మోహన ఇందుకూరి, సత్య మాట్లాడుతూ.. అవగాహన లేక పోవడంతో పరీక్షలకు వేల ఖర్చు అవుతుందని, దాంతో పరీక్షలకు దూరంగా ఉంటున్నారన్నారు.



లూయిస్ బ్రెయిలీ భవనంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఉరి వేసుకుని మైనర్ మృతి

కుత్బుల్లాపూర్, జూన్ 18 : తండ్రి మందలించడంతో ఓ మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ పైపులైన్ రోడ్డు మార్గంలో నివాసముంటున్న జ్యోత్స్న (14) ఓ ప్రైవేట్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నది. పాఠశాల నుంచి సాయంత్రం ఆలస్యంగా వస్తుండడంతో తండ్రి లింగప్ప ప్రశ్నించాడు. మనస్థాపానికి గురైన ఆమె బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నది. గమనించిన తండ్రి ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



బాలానగర్ : సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. బుధవారం హనుమాన్ నగర్ లో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. సమీక్షా సమావేశం నిర్వహించి డ్రైనేజీ, వాననీరు, విద్యుత్ స్తంభాలు, లో వోల్టేజ్, డంపింగ్ వ్యర్థాలు తదితర సమస్యలపై కాలనీవాసులతో చర్చించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్ రెడ్డి, ఏఈ ఆశ, బీఆర్ఎస్ నాయకులు హరినాథ్, మన్నే ఉదయ్‌యాదవ్, ఖదీర్, బుర్రి యాదగిరి, శ్యాం, మోహన్, మొక్కల మహేశ్, పోచయ్య పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట, జూన్ 18 : ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని కార్పొరేటర్ విజయ్‌శేఖర్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయన బుధవారం స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. చదువు, క్రీడల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శంకరయ్య, లక్ష్మీనాథ్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అపార్ట్‌మెంట్లో అగ్నిప్రమాదం



దుండిగల్ : ఓ అపార్ట్‌మెంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ఏసీలో తలెత్తిన సాంకేతిక సమస్యతో ఫస్ట్‌ఫ్లోర్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఫస్ట్‌ఫ్లోర్‌లోని వారిని టెర్రాస్ పైకి చేర్చి ప్రాణాపాయం జరగకుండా కాపాడగలిగారు. వివరాలలోకి వెళితే.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతి నగర్ లోని హిల్‌టాప్ అపార్ట్‌మెంట్, ఫస్ట్‌ఫ్లోర్, 101 ఫ్లాట్‌లోని ఏసీలో బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో సాంకేతిక సమస్యతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి అగ్నిమాపక అధికారి జగన్మోహన్ సిబ్బందితో కలిసి ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందుగా ఫస్ట్‌ఫ్లోర్‌లోని 24 ఫ్లాట్లలో నివాసముంటున్న 60 మందిని సురక్షితంగా టెర్రాస్ పైకి తీసుకెళ్లారు. గంట పాటు శ్రమించి ఫైర్‌ఇంజిన్ల సహాయంతో మంటలను ఆర్పి వేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

# పేదలంటే కాంగ్రెస్‌కు ఇంత అలుసా?

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 18: పేద ప్రజల కోసం ప్రభుత్వ వైద్యశాల, పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేసి రెండేండ్లయినా...అధికార కాంగ్రెస్ పార్టీ ఆ పనులను చేపట్టడంలేదని, పేదలంటే ప్రభుత్వానికి ఇంత అలుసా? అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రశ్నించారు. బుధవారం ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అధికారులతో కలిసి పర్యటించారు. కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్, టౌన్‌షిప్ మధ్యలో డ్రైనేజీ సమస్యను, 100 పడకల ప్రభుత్వ వైద్యశాల స్థలాన్ని, కాలనీ 3వ ఫేజ్‌లోని ప్రభుత్వ పాఠశాల నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. అనంతరం వార్డు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాలనీ 5వ ఫేజ్, మలేషియన్ టౌన్షిప్ మధ్య డ్రైనేజీ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో నివసించే పేదలకు ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో రెండేండ్ల కిందట వంద పడక గల వైద్యశాల నిర్మాణ పనులకు మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి శంకుస్థాపన చేశామని, నేటికీ ఆ పనుల్లో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో కాలనీ 3వ ఫేజ్ రమ్యగ్రౌండ్‌లో ప్రభుత్వ పాఠశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పనులు కూడా ప్రారంభించామని, ఆ పనులను పూర్తిచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.



కేపీహెచ్‌బీ వార్డు కార్యాలయంలో అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే కృష్ణారావు కార్పొరేటర్ శ్రీనివాసరావు

### కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని, ఆ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గతంలో ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి క్రీడా పరికరాలు, ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తెచ్చామని, నేడు వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో పార్కుల్లో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఓపెన్‌జిమ్‌లో చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు దెబ్బతిన్నాయని, వాటిని వెంటనే సరి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కార్యదర్శి రాజేశ్ రాయ్, ఆయా విభాగాల అధికారులు, పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## యువకుడిని కొట్టి చంపేశారు..

కొండాపూర్ : కల్లు కాంపౌండ్ వద్ద జరిగిన గొడవలో ఓ యువకుడిని కొట్టి చంపారు. ఈ ఘటన చందానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం, సిరిగిరిపేటకు చెందిన మాసాన్పల్లి రామచందర్, అమరేశ్ (23) నగరానికి వలసవచ్చి లింగంపల్లిలో రాపిడో నడుపుకుంటున్నారు. రాత్రి వేళలో లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై పడుకుంటూ పనులు చేసుకుంటున్నారు. కాగా.. మంగళవారం రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని కల్లు కాంపౌండ్‌కు ఇరువురు వెళ్లారు. అక్కడే ఉన్న ఓ మహిళ.. అమరేశ్‌ను అడ్డుకుని వారం క్రితం మా ఆడమనిషిని బైక్‌పై ఎక్కించుకుని ఎక్కడికి తీసుకెళ్లావురా అంటూ గొడవకు దిగింది. రాంచందర్ గొడవ ఆపేందుకు ప్రయత్నించగా.. పక్కనే ఉన్న మరో మహిళ వీడియోకాల్ చేసి ఇద్దరు వ్యక్తులను అక్కడికి పిలిచి, అమరేశ్‌ను కొట్టాలని చెప్పింది. దీంతో రెచ్చిపోయిన ఆ ఇద్దరు.. అమరేశ్‌ను కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే రాంచందర్.. అమరేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు ..108 సిబ్బంది సహాయంతో అమరేశ్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. యువకుడిని కొట్టి చంపి న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కుత్బుల్లాపూర్ : గంజాయిని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ కు తరలించారు. కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సీఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన మహమ్మద్ సల్మాన్ కొన్ని రోజుల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఎండు గంజాయిని విక్రయిస్తున్నాడు. విశ్వసనీయంగా వచ్చిన సమాచారం మేరకు కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు నిందితుడు ఉం టున్న ఇంట్లో సోదాలు చేయగా 540 గ్రా ముల గంజాయి లభ్యం కావడంతో నిం దితుడని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



దుండిగల్ : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9న చేపడుతున్న నేపథ్యంలో జయప్రదం చేయడానికి సహకరించాలని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ అ ధ్యక్షుడు కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బుధవారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జీడిమెట్ల పారిశ్రామిక ప్రాం త లోడింగ్, అన్లోడింగ్ హమాలీ యూనియన్ కార్మికులతో కలిసి కరపత్రం విడుదల చేశారు. సీఐటీయూ నాయకులు దేవదానం, జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంత హమాలీ సంఘం నాయకులు శీను, కరుణాకర్, మల్లారెడ్డి, పాషా, నర్సింలు, యాదవరెడ్డి, సాధులు, కనకయ్య, శ్రీశైలం, తిమ్మప్ప పాల్గొన్నారు.

## 'ప్లాస్టిక్ ఫ్రీ' స్టేడియంగా గచ్చిబౌలి



శేరిలింగంపల్లి, జూన్ 18: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ శాట్స్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ ఫ్రీ జూన్ థీమ్'తో గచ్చిబౌలి స్టేడియంలో కోచ్‌ల ఆధ్వర్యంలో క్రీడాకారులు స్టేడియం పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా అథ్లెటిక్ స్టేడియం ఇండోర్ స్టేడియం స్విమ్మింగ్‌పూల్ పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ చెత్త చెదారాలు తొలగించి శుభ్రం చేశారు. గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ మధు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా గచ్చిబౌలి స్టేడియాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 23వ తేదీన ఇంటర్నేషనల్ ఒలంపిక్స్ రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో ఒలింపిక్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తామని, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## చదివితేనే మంచి భవిష్యత్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

దుండిగల్, జూన్ 18 : కృషి, పట్టుదల, క్రమశిక్షణే విజయానికి కారణమని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆయన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, బౌరంపేట్‌లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కలెక్టరు నేరుగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ..స్కూల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా? అని అడుగగా.. విద్యార్థులు స్కూల్‌లో స్పోర్ట్స్ ఏర్పాటు చేయాలని, ఎగుడు దిగుడుగా ఉన్న గ్రౌండ్‌ను లెవల్ చేయించాలని కోరారు. దీంతో ఆ విద్యార్థులు కోరిన అంశాలను తప్పకుండా పూర్తి చేస్తామని కలెక్టరు హామీ ఇచ్చారు. స్కూల్‌కు అవసరమైన అంశాలతో నివేదిక తయారు చేసి తనకు అందించాలని స్కూల్ ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. గతంలోనే అదనపు గదుల కొరకు నివేదిక పంపామని ప్రిన్సిపాల్ తెలుపగా మళ్లీ నోటు పెట్టండి, అవసరమైన వసతులను కల్పిస్తామని కలెక్టరు తెలిపారు.

కేపీహెచ్‌బీ కాలనీ : క్షయ( టీబీ )నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ చౌదరి అన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ గుర్తింపు పరీక్షలను నిర్వహించి... ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహన్, మోహన్, రామకృష్ణ పాల్గొన్నారు.



### ప్రాణం కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు

మియాపూర్ : ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళ విషయంలో మియాపూర్ పోలీసులు స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. సికింద్రాబాద్‌కు చెందిన మహిళకు ముగ్గురు పిల్లలు. జూబ్లీ హిల్స్‌లోని ఓ ఇంట్లో కేర్‌టేకర్. అనారోగ్య సమస్యలతో మానసికంగా కృంగిపోయింది. బుధవారం మియాపూర్‌లోని చర్చికి ప్రార్థనకు వచ్చింది. హఫీజ్‌పేట రైల్వేస్టేషన్‌కు వెళ్లి కుటుంబసభ్యులకు ఫోన్ చేసింది. తన పిల్లలను చూపించాలని ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో వారు 100కు ఫోన్ చేశారు. కంట్రోల్ రూం నుంచి సమాచారం అందుకున్న సీఐ క్రాంతికుమార్ మియాపూర్ పెట్రోల్ వన్ మొబైల్ పోలీస్ కానిస్టేబుల్ రుషేశ్వర్రావు , ఏస్పీఓ రాజేశ్వర్ రెడ్డిను అప్రమత్తం చేయడంతో సిగ్నల్స్ ఆధారంగా రైల్వేట్రాక్ వద్ద ఆమె ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పీఎస్‌కు చేరిన వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించి పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. తక్షణం స్పందించిన పోలీస్ స్టాఫ్‌ను సీఐ క్రాంతి కుమార్ అభినందించారు.